## స్టేటిస్టిక్స్

అంత అధునాతనమైన పెద్ద ఆసుపత్రిని నేను అదే చూడడం. ఎలాగో ప్రయాసపడి నా బంధువుని చేర్పించాను. ఆ రోజుకి నేను చేసే పనిలేక చేతిలోని పుస్తకం తెరిచాను. ఉపనిషత్తుల కాలం నాటి ఋషులూ, తాత్త్వికులూ వేదకాలం నాటి యజ్ఞయాగాల ఆడంబ




రాన్ని, బాధ్యతల వికేంద్రీకరణ ధోరణుల్ని ఎలా నిరసించుకున్నారో రచయిత వివరిస్తున్నాడు.

"ఖర్చంతా భరిస్తున్న యజ్ఞకర్త నామ మాత్రంగా నేపథ్యంలో ఉంటాడు. ఒక్కొక్క యజ్ఞానికి ఒక్కొక్క సంవిధానం. యజ్ఞశాల నిర్మాణం ఒకరూ, యజ్ఞకుండం నిర్మాణం ఇంకొకరూ చేసే వారు. హోత్రి ఋగ్వేదం, ఉద్గాత్రి సామవేదం, అధర్యుడు యజుర్వేదం చదువుతే బ్రహ్మ అధర్వవేదమంత్రాలు చదివి పర్యవేక్షణ చేసే వాడు. సత్యాన్వేషణా, జ్ఞాన సముపార్జనా అప్రధానం అయిపోయి, యజ్ఞ సంవిధానం అతి ముఖ్యం అయి కూర్చుంది" ఇలా చదువుతూ, నేను పోర్టికోలో జరుగుతున్న కలకలానికి నా పుస్తకం మూశాను. ఆ గొడవ సాయంత్రం దాకా సాగింది.

ఏం కారణమో ఏమో, పాపం ఒక స్త్రీ ఎత్తైన మేడ మీంచి కింద పడింది. ఎమర్జెన్సీ వార్డు ఆమె కంటి పాపలు చూసి, ఇతరత్రా పరీక్షలు చేసి, కాళ్ళూ, వెన్నుపూస, తల, మల్టిపుల్ ఫ్రాక్చర్స్‌కి గురి అయినట్టు రిపోర్ట్ రాసి ఆర్థోపెడిక్ వార్డుకి పేషంట్‌ను పంపారు. కానీ ఆ వార్డు వాళ్ళు ఆ కేసును అడ్మిట్ చేసుకుందుకు నిరాకరించారు. మెదడు దెబ్బ తిన్నది కాబట్టే ఆమె బతికే అవకాశం శూన్యం. ఒక కేసును ఫెయిల్ అయినట్టు స్టేటిస్టికల్ రికార్డులో చూపించవలసి రావడం ఆ వార్డుకు చేదుగా అనిపించింది. "న్యూరో సర్జరీ వార్డు ఆమెను అడ్మిట్ చేసుకోవాలి" అన్నారు. అందుకు న్యూరో సర్జికల్ గ్రూపు ని మాత్రం సుముఖంగా లేక వెనక్కు పంపింది. ఆ రెండు వార్డుల లోని పెద్దలమా చూసి జాలిపడి ఆ వరండాలోనే, ఆ స్ట్రెచ్చర్ మీదే పేషెంట్ కన్ను మూసింది. రెండు వార్డులూ ఊపిరి తీసుకున్నాయి గట్టిగా.

—గిడుగు రాజేశ్వరరావు

## మేమూ 'పెద్దలము' కాము

స్థానికంగా జరుపుకునే మా సాహిత్య సభలకు ఊళ్ళో వుంటే తప్పక వచ్చేవారు మొక్కపాటి నరసింహ శాస్త్రి. ఒకనాడు సభ జరుగుతూ వుండగా మొక్కపాటి వారు వచ్చి వెనుకభాగాన ప్రేక్షకులలో కూర్చుండిపోయారు. సభా నిర్వాహకుడొకాయన వెళ్లి "ఇలా దయచేయండి" అని వేదిక వేపు చూపాడు.

"వద్దు నాయనా- ఇక్కడే బాగుంది. థ్యాంక్స్" అన్నారు శాస్త్రిగారు.

"పెద్దలు, తమరిక్కడుంటే ఎలాసార్- వేదిక మీద కుర్చీ వుంచాం- సౌకర్యంగా వుంటుంది. దయచేయండి" అన్నాడా నిర్వాహకుడు.

"విక్షేపంలా వున్న నన్ను పెద్దలలో కలిపేసే హక్కు ఎవరిచ్చారయ్యా నీకు?" బొమముడి బిగించి సహజ చతురతతో అన్నారు శాస్త్రిగారు. ఆ చెణుకు విన్నవారంతా ఒక్కసారి గొల్లున నవ్వేరు. వేదిక మీద నుండి ఒకాయన, "అయితే మేం పెద్దలలో కలిసిపోయినట్టేనా?" అనేసరికి సభంతా నవ్వులతో గొల్లుమంది.

—మేకా సుధాకరరావు




ఓ కాలేజీ విద్యార్థిని
?
టీనేజ్ రీడర్స్ కోసం రాస్తున్న సీరియల్

## వరాల వరదలు

ఎప్పుడు వరద లొచ్చినా మా వూరు మునిగి పోతుంది.

పదేళ్ళ క్రితం కూడా ఇలానే వరదలొస్తే బాధితుల కుటుంబాలకి అయిదొందల రూపాయిల చొప్పున ఇచ్చారు. అప్పుడు నాగన్నకి రెండొందలు ఇప్పించారు 'గ్రామ దేవతలు' — భూస్వామిగారు, సర్పంచ్‌గారు, కరణంగారు. భూస్వామిగారి నుంచి అనుమతి, సర్పంచ్‌గారి నుంచి తాటాకులు, కరణంగారి నుంచి కర్రముక్కలు తెచ్చుకుని కొంప నిలబెట్టుకున్నాడు నాగన్న.

వరదలు తగ్గి, ఎండలు ముదిరాకా భూస్వామి మరి నాలుగెకరాల మాగాణిని, సర్పంచ్ ఓ మాంచి ఎడ్ల జతని, కరణంగారు పెళ్ళాం చేతికి రెండు జతల బంగారు గాజులు అమర్చుకున్నారు. ఇంచుమించు ఇలానే సాగేది వరదల సొమ్ము పంపిణీ. తర్వాత్తరవాత




ఎటొచ్చీ కరణంగారి సౌభాగ్యమే మంట కల్సిపోయింది. అందుకే ఆయనకి వరదలొస్తే కష్టం తోస్తోంది మరి! అయినా ఆయన కష్టాన్ని, ప్రజల ఇష్టాన్ని ఖాతరు చేయకుండా మళ్ళీ వచ్చాయి వరదలు... పై నుంచి నిధులూ వచ్చాయి. గ్రామంలోని వరి పంటంతా నీటి పాలై, భూస్వామికి రూపాయిల పంటగా మారింది. వాటికి కరణం ఎలాగూ రాదు. బలహీన వర్గాల వారి కుర్రాడు సర్పంచ్. వాడికి ఓ అయిదు వేలు, ఆఫీసు వాళ్ళకి ఓ రెండు వేలు పడేశాడు భూస్వామి. ఆనందించారంతా. ప్రతి ఏడూ వరదలే రావాలని దేవుణ్ణి ప్రార్థించారు.

నాగన్న ఎప్పటి లానే వరద బాధితుడు. మళ్ళీ ఐదేసొందలు వచ్చాయన్నారు. నాగన్నకి డబ్బై అయిదు రూపాయిలు ముట్టాయి. గుడిసెకి భూస్వామి అనుమతి దొరికింది. సర్పంచ్‌గారు తాటాకులు ఇవ్వగల్గినవారు కాదు. కర్ర లివ్వడానికి కరణంగారు పదవిలో లేరు. అయినా నాగన్న గుడిసె వేసుకోవాలి. "ఏం బతుకురా భగమంతుడా! సావివ్వరా దేవుడా!" అని దేవుణ్ణి మనసారా మొక్కాడు.

దేవుడు చాలా ఇబ్బందిగా ఫీలయ్యాడు. నాగన్న లాంటి వాళ్ళ మొక్కుల్ని పట్టించుకోకపోయినా అడిగే వాడుండడు. కాని, 'గ్రామ దేవతల' కోర్కెల్ని తీర్చకపోతే తనకి ఏటా జరిగే పెళ్ళిళ్ళు ఆగి పోగలవు. పైగా భూస్వామికి మినిస్టర్ చుట్టం. అందుకే భూస్వామి వర్గాన్నే అనుగ్రహించటానికి నిశ్చయించుకున్నాడు.

—దేవరకొండ మల్లికార్జునశర్మ